# సత్య వాక్కు

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్య వాణి' యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలో మేము ముద్రించబోవునట్టి పుస్తకములను, సత్యవాక్కు మాస పత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYAVANI**
(P.O. Box 80) Seshagiri Rao St.,
KAKINADA - 533 004

గమనిక :– మీరు M. O. పంపునప్పుడు గాని, మీ అడ్రసులో మార్పు వచ్చినప్పుడుగాని మీ సత్య వాక్కు నంబరును దయచేసి తెలియ జేయండి.

Rajan Electric Press, Kakinada.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box 80, KAKINADA-533 001.**

*Editor* — J. C. CHOATE

*Managing Editor* — JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity.

సంచిక **3** అక్టోబరు **1982** సంపుటి **3**

# సంపాదకీయము

## క్రీస్తు మరల ఎప్పుడు వచ్చును?

## *( When will Christ come Again ? )*

క్రీస్తు యొక్క సందేశములను బాగుగా నెరిగినవారు ఆయన యందు విశ్వసించి, ఆయన మరల వచ్చును అను వాస్తవమును అంగీకరింతురు. తిరిగి వచ్చెదను అని ఆయన వాగ్దానము చేసెను. "నేను మరల వచ్చెదను" అని ఆయన రూఢిగా చెప్పెను (యోహాను 14:3).

### కొందరు తేదీనే నిర్ణయించిరి

ప్రభువు ఎప్పుడు వచ్చునో అని అనేకులు విస్మయము నొందుచుండగా, కొందరు తేదీనే నిర్ణయించు మట్టుకు వెళ్ళిరి. వారు కొన్ని ప్రవచనములను తీసికొని, వాటికి యేసు యొక్క ఉపదేశములను జోడించి, ఆయా కాలములలో జరిగిన సూచనలను గూర్చి చదువుట ద్వారా క్రీస్తు వచ్చు ప్రాముఖ్య తేదీని వారు నిశ్చయించిరి. వారు ప్రకటించిన పైకెత్తబడుటను (rapture), సహస్ర వార్షిక పాలన

(Pre-millinealism) యందును అసంఖ్యాకులు నమ్మిరి. అదేమనగా ఒక దినమున నీతిమంతులందరు ప్రభువును ఎదుర్కొనుటకు పైకెత్త బడుదురు. తుదకు వారందరు క్రీస్తుతో కలసి యెరూషలేము పట్టణమునకు వత్తురు. ఆయన వారికి రాజై, అక్కడ వారిని 1000 సంవత్సరములు ఏలును. ఆ కాలములో నీతిమంతులు భూమిమీద విలసిల్లుదురు. ఈ జనులు పశ్చిమ ఆసియాలో సంభవించు వాటి విషయమై ఎల్లప్పుడు పట్టించుకొనుచు, ఏ సమయములోనైనను తటస్థించు హార్మెగిద్దోను యుద్ధముకై నిరీక్షింతురు. ఇట్లు క్రమముగా జరిగిన సంఘటనలు ప్రభువు యొక్క పునరాగమమునకు దారి తీయును.

ఈ మానవ సిద్ధాంతము లన్నిటిలో దోష మొకటున్నది. అదేమంటే, బైబిలు వాటిని బోధించుటలేదు. ప్రస్తుతమున్న ఇశ్రాయేలు దేశము బైబిలు బోధించు ఇశ్రాయేలు కాదు. మరియు ప్రపంచమందలి యితర దేశములలో సంభవించు వాటివలెనే పశ్చిమ ఆసియా యందు జరుగు వాటికి బైబిలు సంబంధమైన భావమేమియును లేదు.

## బైబిలు ఏమి బోధించుచున్నది ?

యేసు పరలోకమందున్న తండ్రి నొద్దకు తిరిగి వెళ్ళిన సమయములో, తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు ఆయన ఆ రీతిగానే తిరిగి వచ్చునని శిష్యులకు చెప్పిరి (అపో 1 : 11) ఎట్లనగా, ఆయన మేఘారూఢుడై వచ్చును. అంతేగాని ఆయన ధరపై అడుగిడునని సూచించుచునట్లు యిసుమంతైనను చెప్పబడ లేదు. ఆయన ఈ భూమిమీదికి మరల ఎందుకు వచ్చును ? ఆయన ఒకమారు వచ్చి, తృణీకరింపబడెను. ఆయన తన రాజ్యమును స్థాపించుటకు వచ్చుటలేదు. ఎందుకంటే, సంఘమైయున్న రాజ్యమును యించుమించు రెండు వేల సంవత్సరములనుండి ఆయన పాలించుచు యున్నాడు (మత్తయి 16 : 18, 19; అపో. కా. 2; కొలస్స 1 : 13 హెబ్రీ 12 : 28).

## ప్రభువు పునరాగమన దినము తండ్రికి మాత్రమే తెలియును

యేసు ఇట్లు చెప్పెను : "అయితే ఆ దినమును గూర్చియు, ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే ఎరుగును గాని, ఏ మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను ఎరుగరు" (మత్తయి 24:36). నా మిత్రులారా, క్రీస్తు మరల వచ్చు సమయము తండ్రి ఒక్కడే ఎరిగియున్నట్లయితే, నీకైనను, నాకైనను, మరెవనికైనను ఎట్లు తెలియును ? ఆయన వచ్చుట నిజమైనందువలన, లేఖనములలో ఎక్కడో ఆ మర్మము బయల్పడునను భావము స్ఫురించుచున్నదా ? క్రీస్తు దొంగవలె వచ్చును, అంటే ప్రకటింపని సమయములో ఆయన వచ్చునని లేఖనములు మనకు బోధించుచున్నందున ఆయన వచ్చు సమయము బయల్పరచబడలేదు (2 పేతురు 3:10).

## ఆయన రాకడలో ఏమి సంభవించును ?

క్రీస్తు వచ్చునపుడు సంభవించు వాటిని గూర్చి పేతురు మనకు ఇట్లు చెప్పుచున్నాడు : "ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును; పంచ భూతములు మిక్కుటమైన వేంఢ్రముతో లయమై పోవును; భూమియు దానిమీదనున్న కృత్యములు కాలిపోవును" (2 పేతురు 3:10-13). థెస్సలోనీకయలోనున్న తన సోదరులకు పౌలు యిట్లు వ్రాసెను : "సహోదరులారా, నిరీక్షణలేని యితరులవలె మీరు దుఃఖపడకుండు నిమిత్తము, నిద్రించుచున్న వారిని గూర్చి మీకు తెలియకుండుట మా కిష్టములేదు. యేసు మృతిపొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించినవారిని దేవుడు ఆయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. మేము ప్రభువు మాటలనుబట్టి మీతో చెప్పునదేమనగా, ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచియుండు మనము నిద్రించినవారికంటె ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను ప్రధానదూత శబ్దముతోను దేవుని బూర

తోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తునందు మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలచియుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతోకూడ ఉందుము" (1 థెస్స 4 : 13-17). క్రీస్తు తానే యిట్లు చెప్పెను : "దీనికి ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దము విని, మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు" (యోహాను 5:28, 29). పైకెత్తబడి (rapture) క్రీస్తుతో వెనుకకు వచ్చి వెయ్యేండ్లు ఆయన పాలనలో నుందురని పై వాక్యములు బోధించుట లేదుగాని క్రీస్తు మరల వచ్చినపుడు ప్రతిదానికి అంతము కలుగుననియు, జీవించు నీతిమంతులు మేఘములపై కొనిపోబడి క్రీస్తును కలిసికొందురనియు, దుష్టులును నీతిమంతులును పునరుత్థానమొందుదురనియు, తీర్పు జరుగుననియు, దుష్టులు అగ్నిగుండములో త్రోయబడగా, నీతిమంతులు నిత్యము ప్రభువుతో నుందురనియు సూచించుచున్నవి. 2 కొరింథీ 5:10 మరియు మత్తయి 25 చదువుము.

## క్రీస్తు యింకేమి చేయును ?

దేవుని నెరుగని వారికిని సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయుటకు క్రీస్తు రానైయున్నాడు (2 థెస్స 1:7-9). అదే సమయమందు తన దూతలను పంపి తన రాజ్యమైన సంఘములో నుండి దుర్నీతిపరులను సమకూర్చి అగ్నిలో పడవేయును (మత్తయి 13:41). అటు తరువాత ఆయన రాజ్య సంబంధమైన నీతిమంతులను తన తండ్రికి అప్పగించును (1 కొరింథీ 15:20-29).

## నీవు సిద్ధముగా ఉన్నావా ?

ప్రభువుకు విధేయుడవైతివా? నీవు క్రైస్తవుడవా? ప్రభువు

రాజ్యమైన సంఘములో నీవు సభ్యుడవా? కానట్లయితే, నీవు క్రీస్తు నెదుర్కొనుటకు సిద్ధముగా లేవు. సిద్ధపడుటకు నేడే సుదినము. రేపటికి మరింకా ఆలస్యము. నీవు క్రీస్తునందు విశ్వసించి, బాప్తిస్మము నొందినట్లయితే ఆయన నిన్ను రక్షించును (మార్కు 16:16). మరియు తన సంఘమునకు నిన్ను చేర్చును (అపొ. కా. 2:47). చివరగా, నీవు మరణమువరకు ఆయనకు నమ్మకముగా ఉన్నట్లయితే, ఆయన మరల వచ్చినపుడు పరలోకమందు నీకు ఒక గృహము అనుగ్రహింతునని ఆయన వాగ్దానము చేసెను (ప్రకటన 2:10; 22:14).

---

# మృతుల పునరుత్థానము
## *(Resurrection of the Dead)*

మానవులు మరణించినను ఒకానొక దినమందు తిరిగి లేచెదరను బోధ క్రైస్తవ్యములో ప్రత్యేకమైనది. మానవులందరు నిత్యము జీవించాలని, అమర్త్యతను సాధించాలని ఆశకలిగిన వారని మనము గమనించి యుంటిమి. మానవుని ఆత్మ నిత్యము జీవించునని అనేకులు నమ్ముదురు. అయితే మరణమువలన శరీరముతో వేరుచేయబడిన ఆత్మ తిరిగి ఒకానొకదినమందు శరీరమును ధరించుకొనును అని బైబిలు బోధించుచున్నది. దీనినే మనము పునరుత్థానము లేక మృతులలో నుండి తిరిగి లేచుట యని చెప్పుకొంటూయుంటాము.

పునరుత్థానము అను పదము 'అనస్తాసిస్' (**Anastasis**), అనెస్టిమి (**Anestimi**), ఎగైరో (**Egeiro**) అను గ్రీకు పదములనుండి ఉద్భవించినది. ఈపదములు నిద్రనుండి లేపుట, లేచుట, లేపబడుట యను భావమును కలిగి యున్నవి.

క్రొత్త నిబంధన గ్రంథములో మూడు ప్రత్యేక పునరుత్థాన సందర్భములను గూర్చి వ్రాయబడి యున్నది. మొదటిగా యేసును,

ఆయన అపొస్తలులును చనిపోయినవారిని లేవదీయుటను గూర్చి వ్రాయబడిన సందర్భములు. రెండవదిగా యేసు తనకుగా తాను మృతులలోనుండి లేచిన సందర్భము, మూడవదిగా మానవులందరును మృతులలోనుండి లేచుటను గూర్చిన సందర్భము.

యేసు ఈలోకములో యున్నప్పుడు చనిపోయిన యాయీరు కుమార్తెను, నాయీను విధవరాలి కుమారుని లాజరును మృతులలో నుండి లేవదీసెను (మత్తయి 9:18-26; లూకా 7:11-18; యోహాను 11:23-46). అట్లే అపొస్తలుడైన పేతురు తబీతా అను చనిపోయిన స్త్రీని సజీవరాలుగా లేవదీసెను (అపొ. కా. 9:36-42). అపొ. పౌలు ఐతుకు అను ఒక యౌవనస్థుడు మూడవ అంతస్తునుండి పడి చనిపోగా అతనిని లేవనెత్తెను (అపొ. కా. 20:8-12). అయితే ఈసందర్భములలో మనము గమనించవలసినది యేమంటే మృతులలోనుండి లేవదీయబడిన వీరందరు మరల మరణించుటకే లేవదీయబడిరి.

## యేసు పునరుత్థానము

యేసు యొక్క పునరుత్థానమైతే అట్టిదికాదు. ఆయన మరెన్నడును మరణించకుండుటకై తిరిగి లేచెను. ఆయన చనిపోకముందే పునరుత్థానుడ నగుదునని యేసు ప్రవచించెను (మత్తయి 16:21). ఆయన చెప్పినరీతిగనే చనిపోయి సమాధిచేయబడి, మూడవ దినమున తిరిగి లేచెను. అది శరీరముతో కూడిన పునరుత్థానము. ఆయన తిరిగి లేచినప్పుడు మహిమ శరీరము గలవాడాయెను.

యేసుయొక్క పునరుత్థానము యథార్థమని మనము నమ్ముటకు అనేక ఆధారములు కలవు. క్రొత్తనిబంధనలోని మొదటి నాలుగు సువార్తలు క్రీస్తు పునరుత్థానమును గూర్చి బోధించుచున్నవి. ఆయన తిరిగి లేవగా ఆయనను పాతిపెట్టిన సమాధి ఖాళీగా యుండెను. ఆ సమాధిదగ్గర దేవదూత తాను చెప్పినట్లే యేసు లేచెనని సాక్ష్యమిచ్చెను (మత్త 28:7). యేసు యొక్క అపొస్తలుల జీవితములో కలి

గిన గొప్పమార్పే ఆయన తిరిగి లేచెనని మనకు నిర్ధారణ చేయుచున్నది. క్రీస్తు చనిపోవకముందు వారందరు పిరికివారై అటు యిటు పారిపోయిరి గాని ఆయన పునరుత్థానుడయ్యెనని సాక్ష్యమిచ్చుటలో వారేమియు జంకక తమ ప్రాణములను సయితము వారు కోల్పోయినట్లు మనము గమనించగలము. అంతేకాదు, మొదటి శతాబ్దమునుండి నేటివరకు యున్న క్రైస్తవులు ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడుకొనుట, ఆరాధనలో ప్రభురాత్రి భోజనము చేయుట యనునవి క్రీస్తుయొక్క మరణ పునరుత్థానములను సూచించుచున్నవి. యేసు ఆదివారమున మృతులలో నుండి లేచుటవలన ఆరోజుకు అట్టి ప్రాముఖ్యత కలిగెను.

యేసు క్రీస్తు మృతులలో నుండి యెట్లు లేచెనో అట్లే మానవులందరు లేచెదరని బైబిలు బోధించుచున్నది. క్రీస్తు లేచుటద్వారా అది నమ్మదగిన వాస్తవమని మనకు నిర్ధారణ చేయబడినది. "ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేవబడి యున్నాడు. మనుష్యునిద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యునిద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు" అని పరిశుద్ధాత్మావేశము వలన అపొ. పౌలు 1 కొరింథీ 15:20-22లో వ్రాసెను.

ఈపునరుత్థానము క్రీస్తు రెండవసారి వచ్చునపుడు జరుగును: "యేసు మృతిపొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించిన వారిని దేవుడాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. మేము ప్రభువు మాటనుబట్టి మీతో చెప్పునదేమనగా, ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచియుండు మనము నిద్రించిన వారికంటె ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను, ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము

నుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆమీదట సజీవులమై నిలచియుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతోకూడ ఉందుము" అని అపొ. పౌలు మరల బోధించెను (1 థెస్స 4:14-17).

మృతులైనవారందరు, నీతిమంతులేమి, అనీతిమంతులేమి అందరు ఆదినమందు పునరుత్థానులగుదురని యేసు బోధించెను. ఆయన ఇట్లుచెప్పెను: "దీనికి ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలోనున్న వారందరు ఆయన శబ్దమును విని మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటకి వచ్చెదరు" (యోహాను 5:28, 29).

ఆ పునరుత్థాన దినమందు జీవించుచున్నవారు మార్చబడుదురు. "ఇదిగో, మీకు ఒక మర్మము తెలుపుచున్నాను; మన మందరము నిద్రించము గాని నిమిషములో, ఒక రెప్పపాటున కడబూర మ్రోగ గానే మనమందరము మార్పు పొందుదుము. బూర మ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు, మనము మార్పు పొందుదుము" అని 1 కొరింథి 15:51, 52 లో వ్రాయబడి యున్నది.

## మార్చబడిన శరీరము

పునరుత్థాన దినమందు సజీవులైనవారు రెప్పపాటులో మార్చబడగా మృతులైనవారు శరీరముతో కూడ లేపబడుదురు. అందుకే "మృతులలో నుండి యేసును లేపినవాని ఆత్మ మీలో నివసించిన యెడల మృతులలో నుండి క్రీస్తు యేసును లేపినవాడు చావునకు లోనైన మీ శరీరములను కూడ మీలో నివసించుచున్న తన ఆత్మ ద్వారా జీవింప జేయును" అని రోమా 8:11 లో అపొ. పౌలు బోధించెను. మృతులైనవారు శరీరముతో లేచినను వారు మార్చబడిన

శరీరముతో లేచెదరు. "మృతుల పునరుత్థానమును ఆలాగే, శరీరము క్షయమైనదిగా విత్తబడి అక్షయమైనదిగా లేపబడును; ఘనహీనమైన దిగా విత్తబడి మహిమ గలదిగా లేపబడును; బలహీనమైనదిగా విత్త బడి బలమైనదిగా లేపబడును. ప్రకృతి సంబంధమైన శరీరముగా విత్త బడి ఆత్మ సంబంధ శరీరముగా లేపబడును" అని **1** కొరింథి 15:42-44 లో వ్రాయబడి యున్నది.

సమాధిలో పాతిపెట్టబడిన శరీరముకంటె దానినుండి లేచు శరీరము మేలైనదని దీనివలన గ్రహించుకొనగలము. లేపబడు శరీరము విత్తబడు శరీరముకంటె మార్పు జెందినదైనను అది తన రూపురేఖ లను (**Identity**) కోల్పోవునట్టిదికాదు. మృతులలో నుండి లేచిన క్రీస్తుయొక్క శరీరము అన్ని భౌతిక అవాంతరములను దాటగలిగెను. తలుపులు వేసియుండినను ఆయన గదిలో ప్రవేశించగలిగెను. అంతలో కనబడి అంతలో మాయమైపోగలిగెను. మనము ఇప్పుడు కలిగియున్న భౌతిక శరీరమును దేవుడు ఈలోకమున కనుకూలముగా సృజించెను. అట్లే నిత్యజీవితమున కనుకూలమగు శరీరమును ఆయన తప్పక మనకు దయచేయగలడు (1 కొరింథి 15:36-42; రోమా 8:11).

కొందరు మృతుల పునరుత్థానము లేదని వాదించెదరు: అయితే అట్టివారికి అపొ. పౌలు ఇట్లు జవాబు చెప్పుచున్నాడు, మృతుల పున రుత్థానము లేనియెడల క్రీస్తు లేపబడి యుండలేదు. అట్లయితే అపొస్త లులు చేసిన ప్రకటన వ్యర్థమే, సరిగదా వారు అబద్ధసాక్షులగుదురు. క్రీస్తు లేపబడని యెడల క్రైస్తవుల విశ్వాసము వ్యర్థమే, వారింక తమ పాపములలోనే యున్నారు. అంతేకాదు క్రీస్తునందు నిద్రించినవారును నశించిరి. ఈ జీవితకాలము మట్టుకే క్రైస్తవులు క్రీస్తునందు నిరీక్షించు వారైన యెడల మనుష్యు లందరికంటె దౌర్భాగ్యులై యుందురు (1 కొరింథి 15:12-19).

అయితే క్రీస్తు లేపబడెను, తద్వారా మనందరము చనిపోయినను మరల లేపబడుదుము అని ఆయన నిరూపించెను. క్రైస్తవుని జీవిత నిరీక్షణ కేవలము సమాధి యొద్ద అంతమయ్యేదికాదు. సమాధి కేవలము కనిపెట్టు సమయము మాత్రమే. క్రీస్తు మరల రాగా క్రైస్తవుడు ఆయనతో నిత్యము జీవించుటకు యెదురు చూచుచున్నాడు. మిత్రుడా, నీసంగతి యేమి? యేసుక్రీస్తు ఈ ఘడియలో ప్రత్యక్షమైనయెడల నిత్యత్వమును ఎక్కడ గడుపుదువు? క్రీస్తుతో గడపాలనుకుంటే ఆయనయందు నమ్మి ఈనాడే బాప్తిస్మము పొంది మరణ పర్యంతము నమ్మకముగా యుండుము (మార్కు 16 : 16; ప్రక 2 : 10).

— జాషువా గూటం.

---

## తీర్పు దినమొకటి యున్నది
## *(There is a Judgment Day)*

బైబిలు ఇట్లు చెప్పుచున్నది: "ఎందుకనగా తాను నియమించిన మనుష్యునిచేత నీతి ననుసరించి భూలోకమునకు తీర్పుతీర్చబోయెడి యొక దినమును నిర్ణయించియున్నాడు. మృతులలోనుండి ఆయనను లేపినందున దీనిని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగ జేసియున్నాడు" (అపో. కా. 17:31). ఆ దినము ఎంత త్వరగా రాబోవుచున్నదో మనం యెరుగము. గాని ఈలోకం అంతమైనప్పుడు, మానవజాతి తనను గూర్చి తాను లెక్క అప్పగించుకోవాలని మనం యెరుగుదుము ( 2 కొరింథీ 5:10).

ఒకవిధంగా, మనం చనిపోయినప్పుడు తీర్పు సంభవిస్తాది. "మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పుజరుగును" (హెబ్రీ 9:27). మనం చనిపోయినప్పుడు మనఅదృష్టం యిక ముద్రవేయబడును. చనిపోయిన తరువాత మరో తరుణం మన

కనుగ్రహించబడునని బైబిలు బోధించుటలేదు. మరోతరుణం దొరుకునని చెప్పు అబద్ధబోధకులు అనాధారమైన నిరీక్షణ కలిగియున్నారు.

దేవుని మహా సింహాసనము యెదుట సమస్త జనాంగములు నిలబడును. గొప్పవారేమి కొద్దివారేమి, ధనికులేమి ధనహీనులేమి, అందరు ఆయన యెదుట నిలుతురు. శిక్షవిధించకుండ అప్పుడు దేవునికి మనమేమియు ఇయ్యలేము. తీర్పు అందరికీ సంభవించును.

దేవుని కలసికొనుటకు మనం సిద్ధముగా యున్నామా? "ఇశ్రాయేలీయులారా, మీ దేవుని సన్నిధిని కనబడుటకై సిద్ధపడుడి" యని పురాతన ప్రవక్తయగు ఆమోసు తన ప్రజలను హెచ్చరించెను (ఆమోసు 4:12). రోమా గవర్నరయిన ఫేలిక్సుయెదుట నిలబడి అపొస్తలుడైన పౌలు అతనికి బోధించిన విషయములలో రాబోవు విమర్శ ఒకటి. రాబోవు తీర్పునుగూర్చి ఫేలిక్సు సిద్ధపడినట్లు రుజువేమీ మనకు కనబడదు.

తీర్పుకొరకు సిద్ధపడాలంటే మొదటిగా, తిరిగి జన్మించవలెను (యోహాను 3:1-8). మనము క్రీస్తు సువార్తకు లోబడవలెను. మార్పు జెందిన తరువాత పవిత్రమైన విశ్వాసములో పెరుగవలెను. అట్లుచేయుటవలన తీర్పు దినముకొరకు సిద్ధపడగలము. నశించిపోవుటకు బదులు ప్రభువుతో నిత్యము ఉండులాగున పరలోకమునకు వెళ్లుదుము.

—రిచర్డ్ బోనర్

---

యేసును వెంబడించిన పండ్రెండుగురు - 7

## తోమా : విశ్వాస సందేహముల జీవితం

## *(Thomas : Faith and Doubt in life)*

తోమానుగూర్చి నిజంగా తెలిసిన దానిని పరిశీలిస్తే అతడంత ప్రసిద్ధమైనవాడు కాడనిపించుచున్నది. సందేహించు తోమా

అనే "దిదుమ" అతని కేలాగూ ఉన్నది. గాని అది లేఖనాల్లో ఆరంభించ బడలేదు. తోమా జీవితంలో వాస్తవాన్ని, కట్టుకథలను వేరుచేయుట సులభమే.

అతనిగూర్చి యున్న కథలలో అనేకములు "ఇండియాకు అపొస్తలుడైన తోమా కార్యములు" అను పుస్తకమునుండి ఆరంభించ బడినవి. యిది రెండో శతాబ్దములోనో లేక మూడో శతాబ్దము లోనో వ్రాయబడెను. దాని గ్రంథకర్త యెవరో తెలియదు. తోమా భారతదేశపు అపొస్తలుడని, అతని ధర్మ కార్యములవలన అక్కడ ప్రసిద్ధి కెక్కిన వాడని ఈ పుస్తకం చెబుతుంది. అయితే ఈ పారంపర్యంలో చెప్పబడిన దేదియు ఖచ్చితముగా నిరూపించుటకు అనుగుణంగా లేదు. అందువలన ఖచ్చితంగా తెలిసికొనడానికి వీలున్నదాన్ని యెరుగుట అవసరం.

తోమాను గూర్చి లేఖనాల్లో చెప్పబడింది తక్కువే. అతడు 12 గురిలో ఒకనిగా లెక్కింపబడెను (మత్తయి 10:3; మార్కు 3:18; లూకా 6:15; అపొ. కా. 1:13). అతడు బహుశ కవలలలో ఒకడై యుండవచ్చును. అందుకే అతడు "దిదుమ" అనబడిన తోమా (యోహాను 11:16; 21:2). ఇంకా ఆలోచిస్తే సందేహ స్వభావమువలన మిగిలిన వారినుండి అతడు వేరుగా అగుపడుటలేదని గమనించగలము. మొదటిగా, సందేహములతో యున్నవాడు అతడొక్కడే కాదు. మగ్దలేనే మరియ పునరుత్థానుడైన క్రీస్తును చూచినట్లు అపొస్తలులకు తెలియ జేయగా వారామె సాక్ష్యమును సందేహించిరి (మార్కు 16:11). తరువాత తమవారిలో యిద్దరి సాక్ష్యము నేవారునమ్మక పోయిరి (మార్కు 16:13). "పిమ్మట...ఆయన వారికి ప్రత్యక్షమై తాను లేచిన తరువాత తన్నుచూచిన వారి మాటనమ్మనందున వారి అపనమ్మిక నిమిత్తమును హృదయ కాఠిన్యము నిమిత్తమును వారిని గద్దించెను"(మార్కు

16:14). వారు నమ్మలేదు సరిగదా తమతో చెప్పిన స్త్రీలమాటలు వారికి వెర్రిమాటలుగా కనబడెను (లూకా 24:11).

రెండవదిగా, సందేహముకంటె యితరగుణములనుబట్టి తోమా మిగిలినవారినుండి వేరుగా కనబడు సందర్భము లనేకములున్నవి. అతడు అభ్యాస సిద్ధమైనవాడు (Practical), సరళప్రవర్తన గలవాడు (straight forward). యేసు తన శిష్యులకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నానని, ఆయన వెళ్ళుచున్న స్థలమునకు మార్గమువారికి తెలియునని చెప్పగా బహుశా వారిలో యెవరు దానిని అర్థం చేసికొనలేక పోయిరి. వారి దిగ్భ్రమను తోమా యిట్లు వ్యక్తపరచెను: ప్రభువా, యెక్కడికి వెళ్ళుచున్నావో మాకు తెలియదే; ఆమార్గ మేలాగు (మాకు) తెలియును?" (యోహాను 14:5).

అంతేకాదు, అతడు సాహసవంతుడు. లాజరు చనిపోయిన తరువాత యేసు యూదయ ప్రాంతమునకు మరల వెళ్లుటకు విశ్చయించుకొన్నాడే గాని, క్షేమకరమైన ప్రాంతమునకు ఆయన వెళ్లుట లేదు. అంతకు కొన్ని వారముల క్రితమే యూదులచే రాళ్ళతో కొట్టబడే ప్రమాదము ఆయనకు సంభవించినది (యోహాను 8 : 59; 10:31-39). అందువలన మరల ఆయన యూదయకు వెళ్ళుచున్నాడంటేఆయన శిష్యులు ఆయనతో వెళ్ళుటకుభయపడిరి. అయితే తోమా తన ప్రభువుతో ఏకమై మిగిలినవారిని గద్దించాడు : "అందుకు దిదుమ అనబడిన తోమా — ఆయనతో కూడ చనిపోవుటకు మనమును వెళ్లుదమని తనతోడి శిష్యులతో చెప్పెను" (యోహాను 11:16).

అయినను మిగిలినవారివలె తోమా సందేహించాడు. అయితే ఒకటి- వారందరు తిరిగి లేచిన తమ ప్రభువును చూచిరి. గాని అప్పుడు తోమా వారితో లేకపోయెను (యోహాను 20:24, 25). యేసు లేచెనని తోమా విశ్వసింపగోరాడు, గాని దాన్ని ఖచ్చితం చేసికొని విశ్వసింపగోరాడు. అందువలన తన ఆశను మొహమాటం లేకుండా

వ్యక్తపరచాడు: "నేనాయన చేతులలో మేకుల గురుతును చూచి నా వేళ్లు ఆ మేకుల గురుతులో పెట్టి, నా చెయ్యి ఆయన ప్రక్కలో ఉంచితేనేగాని నమ్మనే నమ్మనని వారితో చెప్పెను" (యోహాను 20:25). ఇది చాల ప్రాముఖ్యమైన సంగతి. తోమా అందుకే ఋజువు కావాలని కోరాడు. ఇంతకు ముందు యేసు చెప్పిన మార్గాన్ని గూర్చి, యిప్పుడు తన ప్రభువును గూర్చి తోమా తెలిసి కొనుట అత్యవుసరం.

ఎనిమిది దినములైన తరువాత తనకొక అవకాశము దొరికింది. తన ప్రభువును తానే చూచాడు. మేకుల గురుతులను గూర్చి, ఏవిధమైన సందేహములను గూర్చి యిక పట్టుదలలేదు. మిగతా పదికొండు మందికి ఏదైతే సరిపోయిందో తోమాకు కూడ అదే సరిపోయింది. అతడు తన ప్రభువును చూచాడు. అతడాయనను ఎరుగును. వెంటనే అతడు "నా ప్రభువా, నా దేవా!" అని ప్రత్యుత్తర మిచ్చాడు. తోమా మరెన్నడు సందేహించనే లేదు.

—L. A. జేమ్స్.

---

## మార్గాన్ని తెలుసుకోవడం

"అందుకు తోమా-ప్రభువా, యెక్కడికి వెళ్లుచున్నావో మాకు తెలియదే: ఆ మార్గమేలాగు తెలియునని ఆయననడుగగా, యేసు-నేనే మార్గమును, సత్యమును, జీవమును; నాద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకురాడు. మీరు నన్ను ఎరిగియుంటే నా తండ్రిని యెరిగియుందురు. ఇప్పటినుండి మీరాయనను ఎరుగుదురు, ఆయనను చూచి యున్నారని చెప్పెను" (యోహాను 14:5-7).

సంక్షిప్త ప్రసంగము :

# పరలోకం వెళ్ళేవారెవరు?

*(Who is going to Heaven?)*

**పరిచయము :**

1. ప్రకటన 21:1-7, 22-27; 22:1-5
2. పరలోక సౌందర్యమహిమలు
   - a) పరిపూర్ణ ఆనందము
   - b) అత్యంత సౌందర్యముగల ప్రదేశమది. సువర్ణవీధులు, సూర్య కాంతములతో కట్టబడిన ప్రాకారము మొదలగునవి కలవు.
   - c) దానిలో ప్రకాశించుటకై సూర్యుడైనను చంద్రుడైనను దానికక్కరలేదు. దేవుని మహిమయే దానిలో ప్రకాశించును.
   - d) దుఃఖమైనను ఏడ్పయినను అక్కడ ఉండదు.
     దేవుడు ప్రతిబాష్పబిందువును తుడిచివేయును.
     మరణము ఇక ఉండదు.
     దుఃఖమైనను, ఏడ్పయినను వేదనయైనను ఇక ఉండదు.
3. మనలో ప్రతివాడు పరలోకానికి వెళ్ళునట్లు ప్రయత్నించాలి.

**పరలోకమునకు వెళ్ళనివారు :**

1. శరీరకార్యములను జరిగించువారు (గలతీ 5:19-21).
2. మంచివారనిపించుకొన్న వారందరు వెళ్ళలేరు.
   - a) మంచితనం ఒక్కటే సరిపోదు. అదొక్కటే మనల్ని మోక్షానికి తీసుకువెళ్ళదు.
   - b) ఉదా : కొర్నేలీ. అపొ. కా. 10:1-8, 19-22; 11:14
   - c) మార్కు 16:16
3. భక్తిగలవారమనుకొను వారందరు వెళ్ళలేరు.

a) మత్తయి 7:21-23

b) ప్రకటన 22:14

4. బోధకు లందరు వెళ్ళలేరు

a) ఫిలిప్పీ 1:15

b) వారు క్రీస్తును బోధించారు గాని వారి హృదయాలోచన వేరుగా యున్నది

5. బాధ్యత నంగీకరించని సంఘపెద్దలు వెళ్ళలేరు
అపొ. కా. 20:28-31

6. నరకయాతనలో కొంతమంది సంఘసభ్యులుందురు:

a) హెబ్రీ 10:24-29

b) 2 పేతురు 2:20-22

c) ప్రకటన 3:15,16

పరలోకానికి వెళ్ళేవారు :

1. సువార్తకు విధేయులైనవారు. 2 థెస్స 1:7-9

2. ప్రభువుకు విధేయుడయ్యామో లేదో ఎట్లు తెలిసికొనగలము?

a) ప్రభువు ఇచ్చిన ఖచ్చిత ఆజ్ఞలకు లోబడాలి
ఆయన నేరుగా ఆజ్ఞాపించినప్పుడు దానికే లోబడాలి. చితిసార కపు మ్రానుతో ఓడను చేయవలెనని దేవుడు నోవహుకు ఆజ్ఞ యిచ్చెను. అతడా మ్రానుతోనే ఓడను చేయాలి. కుష్టురోగము పోవునట్లు నయమాను యోర్దానులో ఏడుసార్లు మునగవలెనని చెప్పబడెను. అతడు యోర్దానులోనే ఏడుసార్లు మునగాలి. ఆరాధనలో మనం పాటలు పాడాలని దేవుడాజ్ఞ యిచ్చాడు; మనం పాటలనే పాడాలి గాని వాయించరాదు (ఎఫెసీ 5:19).

సాధారణ ఆజ్ఞలకు లోబడాలి. అంటే ఆయన చిత్తాన్ని నెర వేర్చుటకు ఈ సాధారణ ఆజ్ఞలలో మన విచక్షణను వినియోగించవచ్చు. ఉదా : మీరు సర్వలోకమునకు వెళ్ళి సువార్తను

ప్రకటించుడి అని ఆయన ఆజ్ఞ యిచ్చాడు (మార్కు 16:15). ఈ వెళ్ళడం ఎలా వెళ్ళాలి? అనేది మనము నిర్ణయించుకో వచ్చు. కాలినడకనా? సైకిలుమీదా? బస్సులోనా? రైలులోనా? ఇంకా ఎలాగైనా సరే వెళ్ళాలి. అట్లే ప్రకటించుట కూడా. సువార్త కూటములద్వారా! ఇంటింటా! రేడియో ద్వారా? యెలాగైనా సరే బోధించాలి. బోధించాల్సింది సువార్తనేగాని ఇంకేమైనను కాదు. ప్రభువు యిచ్చిన ఆజ్ఞలకు లోబడుచునే జీవించాలి. మరణ పర్యంతము నమ్మకముగా యున్నవారే జీవకిరీటం పొందుతారు (ప్రకటన 2:10).

ము గిం పు :

1. దేవుని చిత్తాన్ని జరిగించువారే పరలోకం వెళ్ళుదురు (మత్తయి 7:21).
2. ఆయనకు విధేయులైనవారికే యేసుక్రీస్తు రక్షకుడుగాని ఆయనకు విధేయులు కానివారికి కాదు (హెబ్రీ 5:8, 9).
3. నీవు పరలోకానికి వెళ్ళాలని కాంక్షించుచున్నావా?

---

## ఆరాధించుటలో ఆనందము
## *( Gladness in Worship )*

"దుప్పి నీటివాగులకొరకు ఆశపడునట్లు దేవా, నీకొరకు నా ప్రాణము ఆశపడుచున్నది" (కీర్తన 42:1). ప్రతి క్రైస్తవుడు దేవుని ఆరాధించుటకు ఆసక్తి కలిగియుండును. దావీదు దేవుని ఆరాధించుటలో నిలకడగా యుండెను; సమర్పించుకొనెను. "యెహోవా మందిరమునకు వెళ్లుదమని జనులు నాతో అనినప్పుడు నేను సంతోషించితిని" యని అతడు చెప్పెను (కీర్తన 122:1). దావీదు ఆరాధనచేసిన దేవుని మందిరము ఒక గుడారము. ఇశ్రాయేలీయులు ఒక స్థలమునుండి వేరొక స్థలమునకు కదులుచున్నప్పుడు తమ ఆరాధన స్థలాన్ని (మంది

రాజు) తమతో కూడ తీసుకొని వెళ్ళేవారు. సొలొమోను దేవాలయాన్ని నిర్మించేవరకు దేవుని ప్రజలకు ఆరాధన చేసే ఒక నిశ్చితమైన స్థావరములేదు. దేవాలయము నిర్మించబడేవరకు దేవుడు ప్రత్యక్ష గుడారములో యుండెను.

ఈనాడయితే దేవుని మందిరమే దేవుని సంఘము (1 తిమో 3:15). సంఘము ఒక ఆలయము లేక గుడి కాదు గాని "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన" వ్యక్తులతో కూడియున్నది. వారే సంఘము (అపొ. కా. 20:28).

సమరయ స్త్రీ యేసుతో, "మా పితరులు ఈ పర్వతమందు ఆరాధించిరి గాని ఆరాధింపవలసిన స్థలము యెరూషలేములో ఉన్నదని మీరు చెప్పుదురని అనెను" (యోహాను 4:20). సరియైన రీతిగ యేసు ఆమె ప్రశ్నలకు జవాబిచ్చిన తరువాత ఆయన ఇట్లనెను: "అయితే యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చేయున్నది, తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు" (యోహాను 4:23). మానవుడు దేవుని ఆరాధించే ఒకేఒక్క నిర్ణీత స్థలము ఇక లేదు. ఆరాధించుటకు దేవుని ప్రజలు ఎక్కడ కూడు కొందురో అదే ఆరాధన స్థలము.

ఆదిమ సంఘస్థులు "అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుటయందును, ప్రార్థన చేయుటయందును ఎడ తెగక యుండిరి" (అపొ. కా. 2:42). మనము జీవించుచున్న క్రైస్తవ యుగంలో దేవుని ప్రజలు స్థానిక సమాజములలో లేక సంఘములలో (**local congregations**) ఆయనను సేవించాలని దేవుడు సంకల్పించాడు. (1 కొరింథి 1:1, 2 కొరింథి 1:1). క్రీస్తుసంఘ సభ్యులు స్థానిక సంఘములో నమ్మకముగా లేనియెడల సంఘము సరిగా పని చేయలేదు, అభివృద్ధి జెందలేదు, గొప్పసంఘము కాలేదు.

ప్రభువును ప్రేమించుటలో మనము పెరగాలి. దావీదువలె మనము ఉండాలి. దేవుని మందిరానికి వెళ్ళడానికి ఎల్లప్పుడు సంతోషించాలి. ఈసంతోషానందాలను యితరులతో పంచుకొనడానికి ఆశ కలిగియుండాలి. వారిని ఆరాధన కూటాలన్నిటికి తీసికొని రావాలి. మనలో ప్రతివారు ఆరాధనకు వెళ్ళేటప్పుడు ఇంకొకరిని తీసుకొని వెళ్ళాలి. అట్లయితే ఎంత బావుంటుందో తెలుసా?

—W. ఎడ్విన్ కియర్లీ

---

## "లేచి...!"

## *(Arise...!)*

లేచి, లెమ్ము అనుపదములు బైబిలునందనేకసార్లు కనబడును. అపొ. కా. 22:16లో అననీయ సౌలుతో లేచి బాప్తిస్మముపొంది నీ పాపములను కడిగివేసుకొమని చెప్పెను. ప్రార్థనకొరకు, ఆలోచించుట కొరకు మనము మోకాళ్ళపై ఉండే సమయం ఉన్నది. గాని మనం మన కాళ్ళపై నిలబడి పనిచేసే సమయం మరొకటి తప్పక యున్నది.

ఇశ్రాయేలీయులు దేవునికి అవిధేయులైనప్పుడు దేవుడు వారి మధ్యకు విషసర్పములను పంపించెను. అప్పుడు మోషే ఇత్తడి సర్పము నొకదానిని చేసి వారు దాన్ని చూడాలని చెప్పెను. వారు లేచి దాన్ని చూచే సమయమది. ఇంకో ఉదాహరణ, 2 రాజులు 5వ అధ్యాయములో నయమాను కనబడుచున్నాడు. అతడు యొర్దానులో ఏడు సార్లు మునగవలెనని ఆజ్ఞాపింపబడెను. అట్లుగాక నయమాను ప్రార్థన చేస్తూ, ఆలోచిస్తూ, చదువుచూ కూర్చొనినయెడల అతనికి కుష్టు రోగము పోదు. అతడు లేచి మునిగే సమయమది!

లేచి అనే ఈ చిన్నమాటనుండి ఈనాడు సంఘము ఎంతో నేర్చుకొనగలదు. సంఘము అబద్ధబోధకులపైకి లేచే సమయమిది! సత్యం అందరికీ ఒకేలాగుండదని కొందరు భావించుచున్నారు. ఇంకో

మాటలో నీకేది సత్యమో అది నాకు సత్యంకాదు అనేది వారివాదన. కొందరు అసత్యాన్ని, అబద్ధబోధను చాల సహించుతారు. అది నీ బోధ, ఇది నాబోధ అని వారు ఒండొరులను సహించుతారు.

సత్యాన్ని ప్రజలకు బోధించుటకు మనము లేచే సమయము ఈనాడే. యేసు యోహాను 8:32లో, "మీరు సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్ము స్వతంత్రులనుగా చేయును" అని చెప్పెను. సత్యాన్ని మానవుడు తెలిసికోలేకపోతే అతడు స్వతంత్రుడయ్యాడో లేదో తెలిసికోలేడు.

సమస్తమును పరీక్షించుడి యని 1 థెస్స 5:21 లో పౌలు మనకు చెప్పుచున్నాడు. ఇదొక సలహాకాదుగాని ఆజ్ఞ! సత్యాన్ని ఎరుగకపోతే దేనినయినా మనం ఎట్లు పరీక్షించగలము? సత్యమేమంటే, మనం సత్యాన్ని తెలిసికొనగలము, తెలిసికొనవలెను!

మనం లేచి క్రొత్తనిబంధన క్రైస్తవ్యాన్ని పునరుద్ధరణ చేసే సమయం ఇది. అవును క్రొత్తనిబంధన క్రైస్తవ్యాన్ని పునరుద్ధరించాలి! ఆపని కొన్ని సంవత్సరాల క్రితమే జరిగిపోయిందని కొందరు అనుకోవచ్చు. గాని ప్రభువుయొక్క ప్రతి స్థానిక సంఘము దాని నమూనాకొరకు క్రొత్తనిబంధన దగ్గరకు వెళ్ళవలసిందే.

అపొస్తలుల కార్యములు గ్రంథాన్ని మనం చదువునప్పుడు ఆదిమ సంఘ సభ్యులనేకులు దేవుని వాక్యాన్ని ఉపదేశించుటలో నిమగ్నులైరి యని మనము గమనించగలము. క్రీస్తును గూర్చియు, ఆయన సంఘమును గూర్చియు యితరులకు చెప్పడానికి వారు కొంత సమయాన్ని గడిపారు. ఈనాటి క్రైస్తవులు వారు వ్యక్తిగతంగా చేసే సువార్తపనికి బదులుగా ఇంకొకటి లేదనే సత్యాన్ని లేచి చూచే సమయం ఇది.

మొదటి శతాబ్దపు సంఘముయొక్క మరొక ప్రముఖ లక్షణమేమంటే, సంఘక్రమశిక్షణ. తన ప్రజలు సంఘక్రమశిక్షణను అవలంబించాలని ప్రభువు కోరుచున్నాడు (2 థెస్స 3:6, 14, 15; రోమా

16:17; 1 కొరింథి 5:5లను చదువండి). బోధకులు, పెద్దలు మరియు సభ్యులందరు లేచి ప్రభువు హెచ్చరించురీతిగా చేయవలెను.

దేవుడు నీయెదుట ఉంచిన పనిని నిర్వర్తించుటకు నీవు లేచె దవా? ప్రతి క్రైస్తవుడు తన యెదుట ఉంచబడినపనిని పూర్తిచేయు టకు లేచి తొందరపడవలెనని దేవుడు కోరుచున్నాడు. క్రైస్తవ్యమనే దీనినిగూర్చి నీవు ఎంత తీవ్రముగాయున్నావు? మనందరము లేచి క్రొత్తనిబంధన క్రైస్తవులుగా యుందాము! నమ్మకమైన క్రైస్తవుల మాదిరి ననుసరించుటకు నమ్మకమైన క్రైస్తవులను ఈలోకస్థులు తెలిసికొనవలసి యున్నది. "గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి...!"

—R. గిల్బర్ట్

---

## బైబిలు నెందుకు చదువ వలెను?

### *( Why Study the Bible? )*

అనేకులు తమ జీవితాల్లో ఈ ప్రశ్నను ఎన్నడు వేసికొనరు. ఈ ప్రశ్నను అడిగే కొందరు జవాబులకొరకు సమయాన్ని వెచ్చించరు. బైబిలును మనం ఎందుకు చదువవలెనో క్లుప్తముగా తెలిసికొందము.

ఈ జీవిత బాటలో మనందరము ప్రయాణించుచున్నాము. దీనిలో ఇంతకుముందు మనలో ఎవడు పయనించలేదు. మనలను ఖచ్చిత మార్గములో నడిపించే పటమొకటి (లేక మార్గదర్శి) మన కవుసరము. ఆ మార్గదర్శియే బైబిలు గ్రంథము. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:16, 17). చీకటిలో నడిపించుటకు మనకొక

వెలుగు అవుసరము. "నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునై యున్నది" (కీర్తన 119:105).

బైబిలు లేనియెడల అత్యంత ప్రాముఖ్యమైన సంగతులనుగూర్చి తెలిసికొనే మార్గమేదియులేదు. ఈ విశ్వము యొక్కయు, మానవుని యొక్కయు ఆరంభము, దేవునిగూర్చి, ఆయన కుమారునిగూర్చి, ఆయన సంఘమునుగూర్చి, రక్షణమార్గమునుగూర్చి, నిత్యజీవమును గూర్చి, నిత్యశిక్షనుగూర్చిన వాస్తవములు బైబిలును చదువుటవలననే మనకు బయలు పరచబడును. మొదటి శతాబ్దములో కొందరికి ఆత్మ జ్ఞానవరమును యేసు అనుగ్రహించెను (మత్తయి 10:19-20; 1 కొరింధీ 12:8). అయితే మానవునికి దేవుని బయల్పాటు సంపూర్తి కాగానే అట్టి వరములు నిలచిపోయెను. అద్భుత జ్ఞానవరమునుగూర్చి పౌలు చెబుతు "జ్ఞానమైనను నిరర్థకమగును" అని వ్రాసెను (1 కొరింధి 13:8). ఇప్పుడు దేవుని నుండి జ్ఞానము సంపాదించే మార్గము ఒకే ఒక్కటి యున్నది. అది ఆయన లిఖించి యిచ్చిన బైబిలు గ్రంధమును చదువుటద్వారా కలుగును.

బైబిలును మనం చదువవలసిన ఇంకొక కారణమేమంటే లేఖనాల్లో ప్రభువు మనలను చదువమని చెప్పాడు. దేవుని ప్రేమించి గౌరవించువారందరికీ ఈ కారణము ఒక్కటే చాలును. "దేవునియెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచు కొనుటకు జాగ్రత్తపడుము" (2 తిమోతి 2:15). "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" అని యేసు చెప్పెను (యోహాను (14:15).

బైబిలు చదువుట అత్యవసరమని, అది మన బాధ్యత యని గ్రహించేలాగున దేవుడు మనందరికి సహాయం చేయును గాక!!

—మార్క్ బర్డ్.

## క్రీస్తు నిర్మించిన సంఘము ఏది?

## *(Which Church did Christ build?)*

తామే క్రీస్తు సంఘమనియు లేక క్రీస్తుసంఘ శాఖ అనియు చెప్పుకొను క్రైస్తవ మతసంస్థలనేక వందలకొలది యున్నవను సత్యాన్ని యెవరు కాదనరు. ఈ మతసంస్థలు సిద్ధాంతములోను ఆచారములలోను ఒకదానికొకటి భిన్నముగా యున్నవని వాటిని చూచు ప్రతివాడు యెరిగినదే. క్రీస్తు ఈసంస్థలను స్థాపించెనా? అట్లయితే వారందరికి ఒకే బైబిలు ఉన్నందున వారు ఎందుకు ఏకీభవించలేరు? ఆ సంస్థలలో దేనినైనను ఆయన స్థాపించెనా? అయితే దేనిని? ఆయన ఒకదానికంటె ఎక్కువ స్థాపించినయెడల ఎన్నింటిని స్థాపించెను? ఏ సంఘములో నీవు చేరినను భేదమేమిలేదు అని కొందరు చెప్పుచుందురు. అది నిజమే అయితే నీవు ఎన్నిసంఘములలో చేరినను ఏమైనా భేదమున్నదా? కొన్ని సదుపాయములను పొందునిమిత్తము మానవులు క్లబ్బులలో చేరుదురు. నీవు ఏసంఘములో చేరినను పరవాలేకపోయిన యెడల సదుపాయములను పొందు నిమిత్తము అనేక సంఘములలో ఎందుకు చేరకూడదు?

## క్రీస్తు ఎన్నిసంఘములను స్థాపించెను?

బైబిలు ఏమి చెప్పుచున్నది? క్రీస్తును అపొస్తలులును వారు చెప్పిన దానినిఉద్దేశించి చెప్పిరా? లేక వారు వేళాకోళమాడిరా? అపొస్తలులు భూమిమీద దేని బంధింతురో అది పరలోకమందును బంధింపబడునని క్రీస్తు చెప్పెను (మత్తయి 16 : 19; యోహాను 20:23). "శరీరమొక్కటే" యని పౌలు చెప్పెను (ఎఫెసీ 4:4). "అవయవములు అనేకములైనను శరీరమొక్కటే" (1 కొరింథి 12:20). ఈ శరీరము ఏమిటి? అదే సంఘము. "మరియు సమస్తమును ఆయన పాదములక్రింద ఉంచి సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆసంఘము ఆయన శరీరము" (ఎఫెసీ 1:22, 23). "...సంఘము అను ఆయన శరీరము కొరకు" (కొలస్స 1:24). శరీ

రమే సంఘము. ఒకే శరీరమున్నదని పౌలు చెప్పెను గనుక ఒకేసంఘము ఉన్నది. "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నలాగున పురుషుడు భార్యకు నరస్సై యున్నాడు" (ఎఫెసీ 5:23). "సంఘము క్రీస్తుకు లోబడి శిట్టుగా..." (ఎఫెసీ 5:24, 25, 27, 29, 32 వచనములను చూడుము). పౌలు సంఘములు అని యనలేదు గాని సంఘము అనెను. క్రీస్తు ఒకే ఒక్క సంఘమును స్థాపించెను గనుక, నీవు ఏ సంఘములో సభ్యుడవై యున్నావో పరీక్షించుకొనుము. ఆయన ఒకే సంఘమునకు శిరస్సు గనుక నీ వాయనతో ఏకము కావలెనన్న ఒక భేదమున్నది.

## డినామినేషన్లు సంఘశాఖలా ?

దేవుడే శరీరమైన తన సంఘములో వివాదము లేకుండునట్లు అవయవములను తన చిత్తప్రకారముంచెనని పౌలు చెప్పెను (1కొరింథీ 12:18,24, 25). డినామినేషన్లలో వివాదములున్నవా? తప్పకుండ ఉన్నవి. అట్లయితే అవి దేవునికి ఇష్టపూర్వకమైనవి కావు. "అయితే దేవుడుఅవయవములలో ప్రతి దానిని తన చిత్తప్రకారము శరీరములో నుంచెను". దేవుడు ఆయా డినామినేషన్లను ఉంచెనా? అట్లయితే దేవుడు వాటిని గూర్చి చెప్పుటను మరచిపోయెను. డినామినేషన్ల పేరులు బైబిలులో ఒక్కసారి కూడ మనకు కనపడవు. దేవుడే వాటి నేర్పరచినయెడల వాటిని గూర్చి ఆయన తన గ్రంథములో చెప్పక పోవుట ఆశ్చర్యము కాదా ?

అయితే, క్రీస్తు ద్రాక్షావల్లి దాని తీగలను గూర్చి చెప్పెను కదా! ఆ తీగలు డినామినేషన్లే యని కొందరు అడుగవచ్చును. ఆయన చెప్పాకు నిజమే, గాని ద్రాక్షావల్లి యెవరు? తీగలెవరు? "నేను నిజమైన ద్రాక్షావల్లిని" అని యేసు చెప్పెను (యోహాను 15:1). క్రీస్తు ద్రాక్షావల్లయితే డినామినేషన్లు తీగలా? ఆయన్నే జవాబు నీయ నిద్దాం: "ద్రాక్షావల్లిని నేను, తీగలు మీరు" అని ఆయన చెప్పాడు (15:5). మీరంటే యెవరు? "ఎవడు నాయందు నిలిచి యుండునో నేను ఎవనియందు నిలిచియుండునో వాడు...". "ఎవడై

నను నాయందు నిలిచియుండని యెడల వాడు తీగవలె బయట పార వేయబడి యెండిపోవును" (15:6). వ్యక్తిగత క్రైస్తవులు తీగలు, తీగలు డినామినేషన్లు కానే కావు.

## క్రీస్తుసంఘము ఏది ? దానిలో యెవరున్నారు?

అది దేవుని సంఘ మనబడినది (అపొ. కా. 20:28). అది నా సంఘమని క్రీస్తుచెప్పెను (మత్తయి 16:18). స్థానికసంఘములను పౌలు క్రీస్తు సంఘములని పిలిచెను (రోమా 16:16). క్రైస్తవ సంఘమని పిలువ వచ్చునా? బైబిలు అట్లెన్నడు పిలువలేదు. గనుక అదివాక్యాను సారంకాదు. సంఘము క్రైస్తవులతో సమకూడినది గాని సంఘము వారిదికాదు. వారు సంఘానికి చెందినవారు గాని సంఘము వారికి చెందినదికాదు. అది క్రీస్తుది. ఈసంఘములో లేనివారు క్రైస్తవులా? ఒక సంస్థలోలేనివారు దానికెట్లు చెందరో క్రీస్తు సంఘములో లేని వారు క్రైస్తవులుకాదు. విమోచన, సమాధానము ఆయన శరీరమైన సంఘములో యున్నది, గాని వెలుపలకాదు (ఎఫెసీ 2:16; 1:22,23).

అపొస్తలుల ద్వారా క్రీస్తుస్థాపించిన సంఘములో బోధకుడె న్నడు రెవరెండు అనిగాని, పాస్టర్ అనిగాని పిలువబడలేదు. బైబిలును చదివిన ప్రతివాడు పెద్ద, బిషప్పు, పాస్టర్ అనుపదములు ఒకే ఒక్క పనిని సూచించు పదములను గ్రహించగలడు. ప్రతి స్థానికసంఘము లోను ఒకనికంటె ఎక్కువమంది ఈపనిని నిర్వర్తించుటకొరకు నియ మింపబడిరి. ఆపదములు బిరుదుగా బోధకుడెన్నడు ధరించుకోలేదు. రెవరెండు పౌలు, పాస్టర్ యాకోబు అను పదములు బైబిలులో ఎక్కడా కనబడవు. "ఒకడు బోధించిన యెడల దైవోక్తులను బోధించు నట్లు బోధింపవలెను" అని పేతురు చెప్పెను (1 పేతురు 4:11). పరి శుద్ధాత్ముని హెచ్చరికను మన మెందుకు నిర్లక్ష్యము చేయాలి?

మీప్రాంతములోయున్న క్రీస్తు సంఘారాధనలకు హాజరవ్వండి !!!

— W. A. బ్రాడ్ ఫీల్డ్

# ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయుట

## ( Calling on the Name of the Lord )

అననీయ సౌలుకు చేయుమని ఏమి చెప్పాడో దానినిబట్టి పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినప్పుడు ఒకడు నిజముగా ప్రభువు నామమునుబట్టి ప్రార్థన చేయునని కనబడుచున్నది (అపొ.కా. 2:33; 22:16). ప్రభువు నామాన్నిబట్టి ప్రార్థన చేయడం అంటే, 'ప్రభువా ప్రభువా, నన్ను రక్షించుమని' కేవలం అడుగుట మాత్రము కాదు గాని యేసు యొక్క అధికారాన్ని శిరసావహించి ఆయన చిత్తానికి లోబడుట యని దాని యర్థము.

తొన్నవాడైన సౌలు తాను పాతిపెట్టబడిన నీటిసమాధి నుండి లేపబడెను (రోమా 6:4), నిజంగా మార్పు నొందినవాడని నిరూపించెను. సంఘమును ఇక హింసించుట మాని ప్రభువుకు ఆయన సంఘముకు కష్టపడి పనిచేసాడు. హింసించువారిని అతడు పూర్తిగా విసర్జించి హింసింపబడువారితో దృఢముగా నిలిచాడు! యేసు సేవకులను ఏ సమాజ మందిరములో హింసించాలని అతడు తలంచాడో దానిలో వెంటనే అతడు యేసును గూర్చి బోధించాడు.

---

Regd. No. H/KD–45/KD H.O.

From
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA–533 001

Printed Book only

To
..............................
..............................
..............................
..............................